
# డయల్ యువర్ సీయమ్




**మా**కాలనీ వాళ్లందరికీ టీవీ చానెల్లో వచ్చే ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడాలని ఒకటే కోరిక– స్క్రీన్ మీద మనం కనబడకపోయినా మన వాయిస్ దేశమంతా మార్మోగిపోతూంటే ఆ థ్రిల్ వేరుకదా!

ముఖ్యంగా మా కాలనీ లేడీస్ వింగ్ కొత్త ప్రెసిడెంట్ యంగ్‌గాళ్ అనూష అలాంటి ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఒక వెలుగు వెలగాలని చాలా ఆశగా ఎదుర్చూస్తోంది.

ఇక పార్వతీదేవి, సావిత్రమ్మా, చంద్రకళలాంటి వాళ్ళు సరేసరి– నిజం చెప్పాలంటే రంగారెడ్డీకీ, శాయిరామ్‌కీ, జనార్ధన్‌కీ, గోపాల్రావ్‌కీ నిసార్‌కీ, యాదగిరికీ– ఇంకా చాలామంది క్కూడా ఆ కోరిక ఉంది గానీ మేం వాళ్ళల్లా బయటపడటం లేదు.

హఠాత్తుగా ఆ రోజు రాత్రే తుగ్లక్ టీవీ చానెల్లో ముఖ్యమంత్రితో ఫోన్ ఇన్ కార్యక్రమం ఫలానా రోజునుంచీ రాబోతోందనీ, మాట్లాడదల్చుకున్న వారంతా ఫలానా నెంబర్‌కి ఫోన్ చేస్తే లైవ్‌గా మాట్లాడవచ్చునీ ప్రకటించారు.

ఆ ప్రకటన రాగానే మా కాలనీ మొత్తం ఎలక్ట్రిఫై అయిపోయింది. ఎవర్ని కదిపినా ఆ టాపిక్కే మాట్లాడుతున్నారు.

"ఏమోయ్ చందర్రావ్– ఆఫీస్ కెళ్ళలేదా ఇవాళ?"

"వారం రోజులు శెలవు పెట్టేశాను బ్రదర్–"

"ఎందుకు? ఏమయినా పనుందా?"

"అవును– చాలా ఇంపార్టెంట్ వర్క్–"

"ఏంటది?"

"అదే– ముఖ్యమంత్రితో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంది కదా! ఆ కార్యక్రమంలో మాట్లాడ్డానికి మంచి కొశ్చెన్స్ తయారు చేయాలి కదా! అందులోనూ నేను కొశ్చెన్స్ వేస్తే సాధారణంగా ఎవడూ రిప్లయ్ ఇవ్వలేడని మీకూ తెలుసు కదా!" అంటూ టేప్ ఆన్ చేసేసరికి మేం వెంటనే జాగ్రత్తపడి అతని ధాటికి అడ్డుకట్టవేశాం!

"అవునవును! నీ సంగతి తెలిసిందే కదా" అన్నాడు గోపాల్రావ్.

"అయితే ఇంక ఇంటికెళ్ళి కొశ్చెన్స్ తయారు చేసుకో–" అన్నాడు రంగారెడ్డి అతని గొడవ వదిలించుకోడానికి–

కానీ చంద్రావ్ మమ్మల్ని వదల్లేదు.

"రెండు రోజుల్నుంచీ రాత్రింబగళ్ళు తలపగలగొట్టుకుని ఎలాంటి అద్భుతమయిన కొశ్చెన్స్ తయారు చేశానో తెలుసా?" అన్నాడు ఉత్సాహంగా.

"వస్తాం– వేరే పనుంది" అంటూ అందరం సైక్లోన్‌గాలి కంటే వేగంగా అక్కడి నుంచి వేరే చోటకు దూసుకెళ్ళిపోయాం.

కాలనీ వాళ్ళందరూ కూడా ముఖ్యమంత్రిని ఏమేం కొశ్చెన్స్ వేయాల్సిందీ రాసుకుని బైహార్ట్ చేస్తున్నారు.

ఆ రోజు రానే వచ్చింది.

నాలుగు ఫోన్లు (కార్డ్‌లెస్) దగ్గర పెట్టుకుని మా మీటింగ్ హాల్లో కూర్చున్నాం.

మా ఎదురుగ్గా టీవీ– సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఫోన్ ఇన్ కార్యక్రమం స్టార్టయింది. అందరు ఆ టీవీ వాళ్ళిచ్చిన నెంబర్ డయల్ చేయటం మొదలుపెట్టాం! మాలాంటివాళ్ళు రాష్ట్రమంతా ఉన్నట్లున్నారు– అందరికీ ఎంగేజ్ వస్తోంది. సడెన్‌గా రంగారెడ్డి ఫోన్ లింకయింది.

ఆ సంగతి తెల్సి అందరూ రంగారెడ్డి చుట్టూమూగారు ఎగ్జయిట్‌మెంట్‌తో–

ముఖ్యమంత్రి ఫోన్లో కొచ్చాడు.

"హలో–"

"హలో సర్– నమస్కారం! నా పేరు రంగారెడ్డి– హైదరాబాద్ నిర్భయ్‌నగర్‌కాలనీ నుంచి మాట్లాడుతున్నా సార్– సార్! మీరూ మీ మంత్రివర్గం అందరూ పరిశుభ్రత పచ్చదనం అంటూ తెగ ఉపన్యాసాలు ఇస్తున్నారు కదండీ! కానీ మా కాలనీకి చెత్త బండి

వచ్చి నెలరోజులయింది. ఇక మా కాలనీ అంతా మొక్కలు నాటాంగానీ, వాటికి పోయడానికి నీళ్ళెక్కడున్నాయ్ సార్? మాకు తాగడానికే నీళ్ళు సరిపోక- నానా ఛావూ ఛస్తున్నాం సార్- మీరు నమ్మరు గానీ నీళ్ళు చాలక మూడు రోజులు కొకసారి స్నానం చేస్తున్నాం! నీళ్ళకోసం ఎంత నరకం అనుభవిస్తున్నామో మీకు తెలీదు సార్-" అంటూ తన దగ్గరున్న పేపర్లోదంతా గడగడా చదివేశాడు.

అందరం ముఖ్యమంత్రి జవాబుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం-

సడెన్‌గా ఆయనగొంతు వినిపించింది.

"నీళ్ళు దొరక్కపోతే ఛావండ్రా బాడుకవ్! సాలే- నేను విస్కీలోకి నీళ్ళు దొరక్క ఛస్తున్నారా! నీ యమ్మ- నావిస్కీ కంటే నీకు స్నానం ఎక్కువైనాది బే- నీకేం దమాకున్నదే రా?"

ఆ జవాబు విని అందరం ఉలిక్కిపడ్డాం.

రంగారెడ్డి మొఖం వాడిపోయింది.

"ఏంటి- ముఖ్యమంత్రి అంత బేవార్స్‌గా మాట్లాడుతున్నాడు?" అన్నాడు శాయిరామ్.

"ఏంటి? నీకు విస్కీలోకి నీళ్ళు ముఖ్యమా? పైగా అలా అసభ్యకరంగా మాట్లాడు తున్నారేంటి?"

"నా యిష్టంరా బాడుకవ్! నేనిలాగే మాట్లాడతా! నేను మందుకొట్టే టైమ్‌లో ఎవడు న్యూసెన్స్ జేసినా ఈ లెవల్లోనే తిడతా! నెక్ట్స్ లెవలేందో ఎరుకనా? బండ బూతులొస్తయ్ బే- అసలు నాకు ఫోన్ చేయమని నీకెవడ్రా చెప్పింది? చీడబట్టిన చెట్టు మొఖం నువ్వూనూ-"

అప్పటిగ్గానీ మాకర్థం కాలేదు- ఆ వాయిస్ ముఖ్యమంత్రిది కాదని- ఎందుకంటే టీవీలో ముఖ్యమంత్రి ఇంకెవరికో సమాధానం ఇస్తున్నాడు.

దాంతో రంగారెడ్డి వళ్ళుమండి ఆ ఫోన్లో ఉన్నాడి మీద తిరగబడ్డాడు.

"ఏయ్- ఎవడ్రా నువ్ మాట్లాడేది-"

"నీ మొగుడ్నిరా- కబూతర్ సాలే-"

"నోర్ముయ్ రాస్కెల్! అసలు నువ్వెవడివో చెప్పురా! నీ అంతుతేలుస్తాం-"

"నేనా? నేనెవరో తెలీదంట్రా! కవాడిగూడా కల్లు కాంపౌండ్ పక్కిల్లో నర్సింహుల్నిరా! నా అంతు చూస్తావ్ బే నువ్వు! ఇప్పుడే రారా! ఎవడి అంత ఎవడు చూస్తాడో తేల్చుకుందాం!"

ఇంక వాడితో డిస్కషన్ అనవసరమని రంగారెడ్డి ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు.

"రాంగ్ నెంబర్ కెళ్లింది- వెధవ టెలిఫోన్ డిపార్ట్‌మెంట్-" అన్నాడు కసిగా.

వెంటనే శాయిరామ్ ఫోన్ అందుకున్నాడు.

"హలో-"

"హలో- ఎవరు?"

"నమస్తే సార్! నా పేరు శాయిరామ్‌సార్! నిర్భయ్‌నగర్ కాలనీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ శెక్రటరీ నిసార్-

"నమస్తే- అడుగు-"

"అదే సార్! మనరాష్ట్రంలో ట్రాఫిక్ రూల్సూ, ట్రావెల్స్ రూల్సూ ఎవ్వడూ పాటించటం లేదు కదా! ట్రావెల్స్ కంపెనీల వాళ్ళు ఆఖరికి పర్మిట్లు కూడా లేకుండా ఇంటర్‌స్టేట్ బస్‌లు నడుసుతున్నారు- దాంతో ప్రమాదాలు జరిగి వేలమంది ఛస్తున్నారు- అయినా మీ ఆర్టీఏగ్గానీ, పోలీసులగ్గానీ చీమకుట్టినట్లుకూడాలేదు- అసలు మన రాష్ట్రంలో గవర్నమెంట్ ఉందో లేదో ఎవడికీ తెలీటం లేదు-"

సరిగ్గా మా ఏరియాలో అప్పుడే పవర్‌కట్‌వల్ల టీవీ ఆఫ్ అయిపోయిందిగానీ ఫోన్ కనెక్షన్ పోలేదు.

"పచ్చనైన ఆకాశంలో ఎర్రెర్రగా వర్షం చినుకులు-" అంటూ ఫోన్‌లో గొంతు వినిపించేసరికి అందరం మళ్ళీ షాకయ్యాం-

"హలో- ఏమంటున్నార్ సార్?"

"తెల్లకోడిపెట్ట- నల్ల పావురాయి డమాఢమ్ - డమాఢమ్-" మాకు మతిపోయి నట్లయింది.

"సార్- మీ మాటలు మాకేం అర్థం కావటం లేదు-"

"అర్థం కాకపోవటమేమిట్రా చిల్లర నరేష్! అవునూ! నువ్వెప్పుడయినా తలకిందపెట్టి కాళ్ళు పైకిపెట్టి చేతుల్తోనడిచావట్రా?"

"అలా ఎందుకు నడుస్తాను- అసలెవరూ అలా నడవరుకదా-"

"నేను నడుస్త్రానా భమ్‌భమ్! అవునూ చీకటికీ-వెల్తురుకీ మధ్యలో ఏముంటుందిరా?"

"గాడిదగుడ్డుంటుంది- మర్యాదగా మాట్లాడకపోతే ఎంత ముఖ్యమంత్రివయినా లెక్క జెయ్యాన్రా!"

"నేను ముఖ్యమంత్రినేమిట్రా చోర్ కందిల్"

"కాదా? నా కప్పుడే డౌటొచ్చింది. ఎవర్నువ్వు?"

"ప్రధానమంత్రిని బే! కనబట్టంలా?"

"ఇదిగో- అతిగా వాగకుండా నువ్వెవరో చెప్పరా!"

"చెప్పాను కదు బే! ప్రైమ్మినిస్టర్! నీకు తెలుసేరా- మనదేశాన్ని రెండు రోజుల్లో

అమెరికాలాగా మార్చేస్తున్నా! ఎలాగని అడగవేంరా? నోటికేమయిందిరా! నోరులేదు బే నీకు– అడుగు–"

"నేనడగను–"

"అడక్కపోయినా చెప్తా(న్రా! తేలిగ్గా వదిలేస్తాననుకోకు! మనదేశాన్ని అమెరికాలాగా ఎలా మార్చేస్తానో తెలుసా? దమ్ముంటే ఎలా మారుస్తానో చెప్పరా!"

"నేన్చెప్పను–"

"ఫర్లేదురా! నేను చెప్తా! ముందు దేశమంతా బీటీ వంకాయల మొక్కలు నాటాల్రా! ఆ చెట్టు పెరిగి పెద్దవృక్షాలయాక వాటికి అమెరికా అన్న బోర్డ్లు తగిలించాల్రా! ఎటు చూసినా వంకాయ్– ఎవడినోట్లో చూసినా వంకాయ్– జై వంకాయ్– జై రత్నాకర్–"

"రత్నాకరెవరు?"

"నీయబ్బ! అదికూడా తెలీదు బే– పంజాబ్ ప్రెసిడెంట్–"

"నువ్వెవర్రానాయినా ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావ్?"

"కేరాఫ్ ఎర్రగడ్డ– వార్డ్ నెంబర్ త్రీ– బెడ్‌నెంబర్ నిల్–"

"ఓర్నీ నా ఫోన్ మెంటల్ హాస్పిటల్ కెళ్ళినట్లుంది–" ఫోన్ కట్ చేశాడు శాయీరామ్.

ఈసారి ఫోన్ అనూషకు దొరికింది.

"హలో–"

"హలో–"

"ముఖ్యమంత్రిగారా సార్?"

"....."

"హలో– హలో– హలో– హలో–"

"ఛ! డిస్కనెక్ట్ అయిపోయింది" అంటూ మళ్ళీ మళ్ళీ డయల్ చేయటం మొదలుపెట్టింది.

"మీరు డయల్ చేసినా నంబర్ మరోసారి సరిచూసుకోండి–"

"అదేంటి? కరెక్ట్ నెంబర్ కొట్టాను కదా–"

"అది మామూలేలే మళ్ళీ చెయ్" అరచారు మిగతా యూత్– మళ్ళీ డయల్ చేసింది.

"ప్రస్తుతం ఈ నెంబర్‌తో ఏ ఫోనూ పని చేయటం లేదు–"

మరో పదినిమిషాలు శ్రమపడ్డాక ఫోన్ రింగయింది.

"హలో నమస్తే నేను నిర్భయ్‌నగర్‌కాలనీ నుంచి అనూషని మాట్లాడుతున్నా–"

"హలో అనూషా! ఇంకా రాలేదేంటి? నీ కోసం ఎంపీగారు ఫామ్‌హౌస్‌లో ఎదుర్చూస్తున్నారు. వీలైతే ఇంకో యిద్దరమ్మాల్ని తీసుకురా, చెరో పదివేలిద్దాం లే– ఎందుకంటే పోలీసాఫీసర్లుక్కూడా అమ్మాయిలు కావాలంట–"

"హలో ఎవర్నువ్వు? అమ్మాయిలేంటి?"

"నేనే మీరాచౌదరి– తెలియనట్టు మాట్లాడాతావేం? నీ సెక్స్ వీడియో నా దగ్గరుంది గుర్తుంచుకో"

అనూష కంగారుపడి చెమటలు తుడుచుకుంటూ చుట్టూ ఉన్నవారందరి వంక భయంగా చూసింది.

"నిజం అంకుల్ అదెవరో నాకు తెలీదు" అంది రంగారెడ్డితో.

"మామూలే రాంగ్‌నెంబర్ అయుంటుంది. ఫోన్ పెట్టెయ్"

అనూష ఫోన్ డిస్కనెక్ట్ చేసి మళ్ళీ డయల్ చేయబోతూంటే ఆమె ఫోనే రింగయింది.

"కట్టయిందికదా! అందుకని ముఖ్యమంత్రిగారే నీ నెంబర్‌కి ఫోన్ చేయించుంటారు." అన్నాడు శాయిరామ్.

అనూష ఆనందంగా ఫోన్ అందుకుని హాలో అంది.

వెంటనే అవతలిగొంతు మాట్లాడటం మొదలుపెట్టింది.

"నమస్తే ముఖ్యమంత్రిగారూ! నేను లింగంపల్లి నుంచి మంగంతల్లిని మాట్లాడుతున్నా సార్!"

అనూష షాకయింది–

"వాళ్ళెవరో ముఖ్యమంత్రికి ఫోన్ జేస్తూంటే నీ ఫోన్ లింకయినట్లుంది–" అన్నాడు రంగారెడ్డి–

"ఆమెతో నువ్ ముఖ్యమంత్రివి కాదని చెప్పు–"

అనూష హలో అనేలోపలే మంగంతల్లి మళ్ళీ మొదలుపెట్టింది.

"హలో ముఖ్యమంత్రిగారూ! మీకేమయినా బుద్ధుందా లేదా? మా ఊళ్ళో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఇప్పటికి ఎనిమిది లెటర్స్ రాసినా! అయినా నువ్ కేర్ జెయ్యలె– నిన్న పధ్నాలుగు కుక్కలు కలసి స్కూల్ కెళ్తున్న మా పాప ఝాన్సీని కరిచనయ్. ఈ ఏరియాలో ఎక్కడా ఇంజెక్షన్స్ దొరకయ్. ఇప్పుడు ఆ కుక్కలు కరిచిన పిల్లలందర్నీ సిటీకి తోల్కపోయి ఇంజెక్షన్స్ జేయించాలె! ఒక్కొక్కరికీ రెండువేలు ఖర్చవుతది– అన్ని పైసలు ఏడకెళ్ళి తేవాలె? మీ హయాంలో ఒక్క డిపార్ట్‌మెంట్ గూడా మంచిగ డ్యూటీలు జేయటంలే! మరి చేతకానప్పుడు నౌఖరీ వదిలిపోవాలె నువ్వు–" ఫుల్‌స్టాప్ లేకుండా ఆమె మాట్లాడుతూంటే అనూష మధ్యమధ్యలో ఇంటర్‌ఫియర్ అవడానికి ప్రయత్నిస్తోంది.

"హలో! నేను ముఖ్యమంత్రినికాదు. నీలాగా నేనూ ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడ్డానికి కోషిష్ జేస్తున్నా!"

ఇద్దరు చాలనట్లు– సడెన్‌గా ఇంకెవడో ఫోన్‌లో కొచ్చాడు.

"ఇప్పుడు మన సమాజాన్ని పట్టిపీడిస్తోన్న లంచగొండతనాన్ని రూపుమాపేదెలా? ఈ విషయంలో మీరేం చేయదల్చుకున్నారు?"

"పిచ్చికుక్కల గురించి అడిగితే లంచగొండితనం గురించి మాట్లాడుతున్నావేంది?" కోపంగా అంది మంగంతల్లి.

"మా ఇండస్ట్రీస్ అన్నీ పవర్‌కట్‌లతో నష్టాలో కూరుకుపోతున్నాయంటే పిచ్చికుక్కల గురించి మాట్లాడుతోందెవరు?" నాలుగోవాడి గొంతు కొత్తగా ఎంటరయింది. అనూష చేతిలోనుంచి శాయిరామ్ ఫోన్ లాక్కున్నాడు.

"అబ్బా– నేను ముఖ్యమంత్రిని కానయ్యా!"

"గంట కిందట నువ్వే గదా ముఖ్యమంత్రివి! ఇంతలోనే హైకమాండ్ కొత్తోడికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందా?"

"హలో– నేనూ నీలాగానే ముఖ్యమంత్రి గురించి ట్రై చేస్తున్నారా భయ్–"

"చేస్కో– నాకెందుకు చెప్తున్నావ్ మళ్ళా?"

"నువ్వేనా ఫోన్లో కొచ్చినావ్–"

సరిగ్గా అప్పుడే ముఖ్యమంత్రి గొంతు ఫోన్లో వినిపించింది

"హలో– ఎవరో ఒక్కరే ప్రశ్న అడగండి–"

"అదేసార్ నేనడుగుతూంటే– ఇంకోడెవడో ఫోన్‌లో కొచ్చిండు–"

"నేను కాదురా! నువ్వే నా ఫోన్‌లో కొచ్చినావ్" అరుస్తోంది మంగంతల్లి.

"సార్– రాజశేఖర్‌రెడ్డి నాకిచ్చిన వృద్ధాప్య పెన్షన్ ఉంటదా? ఊడ్తదా సార్?"

"హలో ఎవరు మాట్లాడుతోంది? నీ పేరేంటి?"

"లింగంపల్లి మంగంతల్లి–"

"చూడమ్మా నీ వృద్ధాప్యం పెన్షన్ గురించి–"

"నేనడిగింది పిచ్చికుక్కల గురించి– " గట్టిగా అరిచిందామె.

"పిచ్చికుక్కలా?"

"నేను ఇప్పటికి పదిసార్లు దోమల సమస్య గురించి అడుగుతోంటే పిచ్చికుక్కలంటా రెవళ్ళువయ్యా–"

"హలో–" అంది ఇంకో ఆడగొంతు–

"హలో–" అంది మరో ఆడగొంతు–

"ఇప్పుడు నా సమస్యకు పరిష్కారం చెప్పండక్కయ్యా! నా భర్తకు విడాకులివ్వకుండా నేను రాకేష్‌ని పెళ్ళి చేసుకోవచ్చా? పెళ్ళికి ముందు నాకూ రాకేష్‌కీ పుట్టినబిడ్డకూ– పెళ్ళయాక నాకూ నాభర్తకు పుట్టిన బిడ్డకూ– ఇద్దర్లో ఎవరికి ఎవరు తల్లిదండ్రులు–"

"చూడమ్మా శ్రీరంగవల్లీ! నువ్ అడిగిన ప్రశ్న చాలా జటిలమయింది. లీగల్‌గా చెప్పాలంటే–"

ఆ వాయిస్ కట్టయింది.

"హలో–" అన్నాడు శాయీరామ్ మధ్యలో.

"హలో ముఖ్యమంత్రిగారూ! నమస్తే సార్– ఇప్పుడు మా తండ్రి సడెన్‌గా పోయాడు గనుక నాకూ ఆ కొలువిస్తారా?"

"హలో– నేను ముఖ్యమంత్రిని కాదువయ్యా–"

"కాకుంటే మరి ఫోనెందుకెత్తినావ్?"

"అసలు నా ఫోన్‌లోకి నువ్వెందుకొచ్చినావ్–"

"నువ్వేనా ఫోన్లో కొచ్చినావ్‌బే–"

"ఏయ్– మాటలు మంచిగ రానీ–

"లేకుంటే ఏం పీకుతావ్‌రా?"

మధ్యలో మళ్లీ ముఖ్యమంత్రి గొంతు వినిపించింది.

"చూడండి– బాలయ్యగారూ! మా ప్రభుత్వం వెనుక బడిన తరగతులు వారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలు టేకప్ చేశామండీ!"

"ఏయ్– ముందు ముఖ్యమంత్రికి కనెక్షనిస్తావాలేదా?"

హఠాత్తుగా మా సావిత్రమ్మ గొంతు ఫోన్లో కొచ్చింది.

"హలో– ముఖ్యమంత్రిగారేనా సార్ మాట్లాడేది?"

"ముఖ్యమంత్రి టెలిఫోన్ పోల్ పైకెందుకెక్కుతాడమ్మా?"

"ఆ మాటెవరన్నారిప్పుడు?"

"నేనే పోల్ మీదకెళ్ళి మాట్లాడుతూంటే నువ్వేగదా– నువ్వు ముఖ్యమంత్రా?అని నన్నడిగినావ్."

"ఏయ్– ఏందిరా! నా పెండ్లాంతో ఎక్కువ తక్కువ వాగుతున్నావ్?"

ఆ డైలాగ్‌కి సావిత్రమ్మ మండిపడింది.

"ఏయ్– ఎవడ్రా నువ్వు? నేను నీ పెళ్ళాన్నా? చెప్పు తీసుకొడతా!"

"బాటా చెప్పులు మంచిగుంటయ్– అదేవాడు–"

"నువ్వెవరసలు? పోల్స్ ఎక్కి ఎందుకు డిస్టర్బ్ చేస్తున్నావందర్నీ?"

మళ్ళీ అరిచింది సావిత్రమ్మ–

"అది నా డ్యూటీ మేడమ్– నేను టెలిఫోన్స్ లైన్‌మెన్‌ని–"

"అయితే మాత్రం– మా ఫోన్‌లో కెందుకొచ్చావ్?"

"ఈ ఏరియాలో చాలా లైన్స్‌తో ప్రాబ్లెమ్ ఉంది– అందుకని బాగుచేయడానికొచ్చా!"

"హలో– మీ హెూటల్లో ఏసీ డబుల్‌రూమ్స్ ఉన్నాయా?"

"రెండు లారీలు లోడ్ చేశాం రా– నెంబర్లు రాస్కో–5161, 3797–"

"గోదావరి ఎంతలేటంటే ఒక్కనా కొడుకూ చెప్పడేం?"

"మల్లికాషెరావత్ ఊపేసిందిరా భయ్–"

"ఏయ్ ఎవర్నువ్వు?"

"గాలి జనార్ధన్‌రెడ్డి–"

"నీకు బెయిలిచ్చినోడిని కూడా లోపట జేసినావ్ గదురా భయ్–జనార్ధన్"

"హలో ముఖ్యమంత్రిగారా? నమస్తే సార్! నా పేరు భిక్షపతి–"

"అరేయ్ భిక్షపతీ– నువ్ ముందు ఫోన్ పెట్టరా!"

"సాయంత్రం ఫామ్ హౌస్‌లో పార్టీ ఉందిరా శంకర్– బాంబే నుంచి 50 మంది టాప్ గాళ్స్ వచ్చారు– నైట్‌కి పదివేలు వస్తావా– వెళ్దాం?"

"హలో– సావిత్రమ్మగారూ! మీ ప్రాబ్లెమేంటో చెప్పండి–" ముఖ్యమంత్రి గొంతు వినిపించింది సడెన్‌గా–

"సార్! మా నిర్భయ్‌నగర్‌కాలనీలో ఇప్పటికి మూడొందల దొంగతనాలు జరిగినయ్ సార్–"

"హై ఓల్టేజ్ ప్రాబ్లెమయ్యా– మేమేం చేయలేం!"

"హలో ఎవరది?"

"కనిమోళి రెండువందల కోట్లు ఏడదాచిందరా భయ్–"

"నాకెరుకే– కానీ నీకు చెప్ప!"

"ఎందుకు చెప్పవ్ బే–"

"నాకు మొత్తం రెండొందల పాతిక పందులూ ఉన్నాయ్ సారూ! కానీ బాంకోళ్ళు అప్పులివ్వటం లేదు– అమ్ముదామంటే కొనేటోళ్ళు లేరు. ధాన్యానికి మద్ధతు ధర ఇచ్చి సరాద్రు కొంటున్నదిగద్సారూ– గట్లనే నా పందుల్నీ సర్కారోళ్ళు మద్ధతు ధరిచ్చి కొనాలి సారూ– లేకుంటే నేనూ నా పెండ్లాంబిడ్డలూ ఆగమయిపోతాం సారూ–"

"హలో రైల్వే ఎంక్వయిరీస్–"

మేం ఫోన్లు విసిరికొట్టి ఎవర్దారిన వాళ్ళు ఇళ్ళకుపోయాం.

* * * * *